క్లుప్తంగా

విద్యుత్ సమస్య పరిష్కరించాలి

కొండమల్లేపల్లి : మండల కేంద్రంలో విద్యుత్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఉట్కూరి వేమన్‌రెడ్డి శుక్రవారం విద్యుత్‌శాఖ డివిజనల్ ఇంజనీర్ విద్యసాగర్‌ను కలిసి విన్నవించారు. దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్ ఈ మేరకు సదరు అధికారితో ఫోన్‌లో మాట్లాడారు. డివిజనల్ ఇంజనీర్ విద్యసాగర్ స్పందిస్తూ రూ.6లక్షలతో విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ కొరకు ఎస్టిమేషన్ వేయించి త్వరలోనే మండల కేంద్రంలో పనులు చేపట్టి కరెంట సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలి

డిండి : స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని సీపీఐ మండల కార్యదర్శి శ్రీరామదాసు కనకాచారి పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. శుక్రవారం సీపీఐ 100వ ఆవిర్భావ వేడుకలను పురస్కరించుకొని మండల పరిధిలోని శేషాయికుంట గ్రామంలో ఆ పార్టీ కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. డిసెంబర్ 26వ తేదిన దేవరకొండలో నిర్వహించే పార్టీ ఆవిర్భావ వేడుకల్లో అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి నూనె వెంకటేశ్వర్లు, ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎనమల్ల నవీన్, చక్రి,చంద్రయ్య,అంజయ్య, లచ్చయ్య మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

చెకుముకి టాలెంట్ టెస్ట్‌లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థినులను అభినందిస్తున్న హెచ్‌ఎం

కొండమల్లేపల్లి : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు జిల్లా స్థాయిలో నిర్వహించిన చెకుముకి పోటీల్లో ప్రతిభ కనబర్చి ప్రథమ స్థానంలో నిలిచారు. ఈ మేరకు ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థినులు నందిని, శివాని, సోనిలను హెచ్‌ఎం నాగేశ్వర్‌రావు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

గుర్రంపోడు : తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు పోలీస్ కృష్ణయ్య 15వ వర్ధంతి సందర్భంగా మండలకేంద్రంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు వెలుగు రవి ముదిరాజ్ ఆవిష్కరించారు. జిల్లా, మండల కేంద్రాల్లో కృష్ణయ్య విగ్రహాలను ఏర్పాటుచేయాలని, వర్ధంతి, జయంతులను ప్రభుత్వం నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ నాయకులు యాదయ్య, వెంకటాద్రి, జలందర్‌పాల్గొన్నారు.

దాతల సహకారం అభినందనీయం



వాటర్ బాటిళ్లు పంపిణీ చేస్తున్న దాత

త్రిపురారం : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు దాతల చేయూత అందించడం అభినందనీయమని హెచ్‌ఎం గంగాదర్‌రావు అన్నారు. గురువారం నీలాయిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివే విద్యార్థులకు అదే గ్రామానికి చెందిన సురేష్ రెడ్డి స్టీల్ వాటర్ బాటిళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ.. దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకుంటూ విద్యార్థుల చదువుతో పాటుగా ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పాటిస్తున్నట్లు తెలిపారు. దాతకు విద్యార్థులు, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.

వసతి గృహానికి రక్షణ కరువు

- సమీకృత బాలికల వసతి గృహంలో ఏడాది క్రితం కూలిన ప్రహరీ
- భయాందోళనకు గురవుతున్న విద్యార్థినులు
- ప్రహరీ నిర్మించాలని విద్యార్థినులు, తల్లిదండ్రుల వేడుకోలు



కూలిపోయిన ఇంటిగ్రేటెడ్ హాస్టల్ ప్రహరీ

పెద్దవూర : మండల కేంద్రంలో పదకొండేళ్ల క్రితం సమీకృత బాలికల వసతిగృహం నిర్మాణానికి అప్పట్లో కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం అందించేందుకు గాను మండల కేంద్రానికి రెండు కిలోమీటర్ల దూరంలో వ్యవసాయ సబ్ మార్కెట్ యార్డు పక్కన ఈ హాస్టల్‌ను నిర్మించారు. మండల కేంద్రంలోని సమీకృత బాలికల వసతి గృహం(ఇంటిగ్రేటెడ్ హాస్టల్)లో గతేడాది వేసవికాలంలో వీచిన బలమైన గాలులకు హాస్టల్ వెనకవైపు ఉన్న ప్రహరీ కూలిపోయింది. ఈ హాస్టల్ నాగార్జునసాగర్–హైదరాబాద్ ప్రధాన రహదారిని ఆనుకుని ఉండటం, మరొక వైపు సంగారం గ్రామానికి వెళ్లే దారి, ఒక వైపు గంగమ్మ తల్లి దేవాలయం, మరోవైపు బత్తాయి తోట ఉంది. బత్తాయి తోట వైపు ఉన్న ప్రహరీ కూలిపోవడంతో ఎవరైనా హాస్టల్‌లోనికి రావడానికి వీలుగా ఉంటుంది. ముందే హాస్టల్ మండల కేంద్రానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉండటంతో ఇప్పటికే భయభ్రాంతులకు గురవుతున్న విద్యార్థినులు ప్రహరీ కూలిపోవడంతో మరింత భయాందోళనలకు గురవుతున్నారు. దీనికి తోడు వ్యవసాయ పొలాలు, బత్తాయి తోటల నుంచి విషసర్పాలు హాస్టల్‌లోకి వస్తున్నట్లు విద్యార్థినులు పేర్కొంటున్నారు. ప్రహరీ కూలిపోవడంతో రక్షణ లేకుండా పోయింది. ఈ విషయమై ఉన్నతాధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా ఇప్పటివరకు ప్రహరిని నిర్మించలేదని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కూలిన ప్రహరీని తొలగించి పునర్మించాలని కోరుతున్నారు.

పాములు వస్తున్నాయి



ప్రహరీ కూలిపోయి ఏడాది అవుతుంది. బత్తాయి తోటలో నుంచి పాములు వంటి విష పురుగులు వస్తున్నాయి. ప్రహరీ కూలిపోకముందు సెలవు దినాలు, సాయంత్రం సమయాల్లో హాస్టల్ వెనకవైపు ఆడుకునేవాళ్లం. ప్రహరీ కూలిపోయాక అటువైపు వెళ్లాలంటేనే భయం వేస్తోంది. అధికారులు హాస్టల్ సందర్శనకు వచ్చినప్పుడు ప్రహరీ నిర్మించాలని చాలా సార్లు విన్నవించాం. అయినా నిర్మాణం జరగడం లేదు.

–డి.అనూష, హాస్టల్ విద్యార్థిని

అధికారులకు విన్నవించాం

ఈ విద్యా సంవత్సరంలోనే బదిలీపై ఇంటిగ్రేటెడ్ బాలికల వసతి గృహానికి వచ్చాను. కూలిన ప్రహరీతో ఎదురవుతున్న ఇబ్బందులను ఉన్నతాధికారులకు సైతం విన్నవించాను. బాలికల హాస్టల్ కావడంతో ఇబ్బందిగానే ఉంది. కూలిన ప్రహరీ నిర్మాణానికి గాను సంబంధిత ఏఈతో కొలతలు వేయించి ప్రతిపాదనలు పంపించాం.

–అహల్య, హాస్టల్ వెల్ఫేర్ అధికారి

రైతు సంక్షేమమే కాంగ్రెస్ ఎజెండా



హాలియా : జెండా ఊపి బస్సు ప్రారంభిస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి



పెద్దవూరలో..



చింతపల్లి : జెండా ఊపి బస్సు ప్రారంభిస్తున్న మండల వ్యవసాయ అధికారి

హాలియా : రైతు సంక్షేమమే కాంగ్రెస్ ఎజెండా అని హాలియా వ్యసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రజాపాలన పేరిట మహబూబ్‌నగర్‌లో నిర్వహిస్తున్న రైతు పండుగ సభకు తరలివెళ్తున్న వాహనానికి ఆయన జెండా ఊపి ప్రారంభించి మాట్లాడారు. రైతు పండుగకు రైతులు వేలాదిగా తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. సాగర్ నియోజకవర్గ వ్యాప్తంగా వివిధ గ్రామాల నుంచి సభకు తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో కొత్తపల్లి పీఏసీఎస్ చైర్మన్ మధు సూధన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నారాయణ గౌడ్, ఏట సరిత, వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ ఆధ్వర్యంలో..

చింతపల్లి : మండల కేంద్రంలోని పీఏసీఎస్ ఆధ్వర్యంలో ప్రజా విజయోత్సవం, రైతు పండుగ కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ లింగంపల్లి వెంకటయ్య మాట్లాడుతూ తమ సొసైటీ ఆధ్వర్యంలో 6000 క్వింటాల్ల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు ఆయన తెలిపారు. అదేవిధంగా రైతులకు కావాల్సిన వరి వంగడాలను 20 టన్నుల వరకు అందించామన్నారు. 780 టన్నుల యూరియా,280 టన్నుల కాంప్లెక్స్ ఎరువులను రైతులకు సరఫరా చేసినట్లు ఆయన తెలిపారు. 524 మంది రైతులకు సుమారు నాలుగు కోట్ల రూపాయలను రుణమాఫీ చేసినట్లు ఆయన తెలిపారు. కేవలం కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ ఆధ్వర్యంలో మాత్రమే రైతులకు మేలు జరుగుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సీఈఓ ఎం.రాజశేఖర్‌రెడ్డి, డైరెక్టర్లు పాల్గొన్నారు.

రాష్ట్ర సదస్సుకు తరలివెళ్లిన రైతులు

మహబూబ్‌గర్ జిల్లా భూత్పూర్ మండలంలోని అమిస్తాపూర్‌లో నిర్వహిస్తున్న రైతు సదస్సుకు మండలంలోని వివిధ గ్రామాల రైతులు శుక్రవారం తరలివెళ్లారు.ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారిని శ్రావణ కుమారి పచ్చ జెండా ఊపి రైతులు వెళ్తున్న బస్సును ప్రారంభించారు. అదేవిధంగా ఈనెల 30న రైతు వేదికలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతులను ఉద్దేశించి చేసే ప్రసంగాన్ని వీడియో ద్వారా వీక్షించడానికి రైతులు సా యంత్రం నాలుగు గంటలకు రైతు వేదిక వద్దకు రా వాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు నరసింహ, మధు, మౌనిక పాల్గొన్నారు.

చందంపేట : మహబూబ్‌నగర్‌లో నిర్వహిస్తున్న రైతు పండగకు చందంపేట, నేరెడుగొమ్ము మండలాల రైతులు బస్సులలో తరలివెళ్లినట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి లక్ష్మతి తెలిపారు. ఈ కార్యక్రమంలో తిమ్మాపురం పీఏసీఎస్ చైర్మన్‌కొండ్ర శ్రీశైలంయాదవ్, డైరెక్టర్ గడ్డం వెంకటయ్య, అఖిలేష్, కాంగ్రెస్ మండ పార్టీ అధ్యక్షుడు బద్యానాయక్, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

పెద్దవూర : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావడంతో నిర్వహిస్తున్న ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా శుక్రవారం మహబూబ్‌నగర్‌లో పాలమూరు రైతు పండుగ నిర్వహించారు. ఈ సదస్సుకు మండలంలోని పలు గ్రామాల నుంచి రైతులను వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతు పండుగకు బస్సులో తీసుకెళ్లారు. మండల వ్యవసాయ అధికారి కె.సందీప్ జెండా ఊపి బస్సును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ మధుకర్, ఏఎంసీ డైరెక్టర్ లక్ష్మయ్య రైతులు నరేందర్‌రెడ్డి, మునిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సీలింగ్ భూమి పరిశీలన

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని తాళ్లగడ్డ 3వ వార్డులోని సర్వే నంబరు 60, 61లో సీలింగ్(మల్లేతోట)భూమిని శుక్రవారం మండల తహసీల్దార్ హరిబాబు సర్వే చేయించారు. ఆయా సర్వే నంబర్లలోని సీలింగ్ భూమి చాలా వరకు కబ్జాకు గురయినట్లు ఫిర్యాదులు రావడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సర్వే చేపట్టినట్లు తెలిపారు. ఈ సీలింగ్ భూమి ఎంత కబ్జాకు గురైంది, ఎంత భూమి మిగిలింది. అసలు సీలింగ్ భూమి ఎంత ఉందనే దానిపై సమగ్ర సర్వే చేయనున్నట్లు తెలిపారు. సర్వే పూర్తయిన తరువాత భూమిని స్వాధీనం చేసుకొని ఆ భూమిలో బోర్డులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సర్వే అనంతరం ఉన్నతాధికారులకు భూమి వివరాలను నివేదిస్తామన్నారు.

బీఆర్‌ఎస్ దీక్షా దివస్..



నల్లగొండలో తెలంగాణ తల్లి విగ్రహానికి నివాళులర్పిస్తున్న బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యేలు రవీంద్రకుమార్, కంచర్ల భూపాల్‌రెడ్డి, చిరుమర్తి లింగయ్య, భాస్కర్‌రావు, భగత్, నాయకులు



కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్ష సమయంలో తీసిన ఫొటోను సభలో ప్రదర్శిస్తున్న కార్యకర్త



నల్లగొండలో నిర్వహించిన బీఆర్‌ఎస్ దీక్షా దివస్ సభకు హాజరైన కార్యకర్తలు, చిత్రంలో కేసీఆర్ దీక్షల ఫ్లెక్సీని ప్రదర్శిస్తున్న శ్రేణులు



తెలంగాణ అమరవీరుల స్థూపానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యేలు, నాయకులు, శ్రేణులు

బీసీలకు సముచిత పదవులు ఇవ్వాలి

మిర్యాలగూడ టౌన్ : కాంగ్రెస్ పార్టీ పదవులు, నామినేటెడ్ పోస్టుల్లో బీసీలకు సముచిత పదవులను ఇవ్వాలని కోరుతూ శుక్రవారం బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. గతంలో ఇచ్చిన పోస్టుల్లో సముచిత ప్రాధాన్యం ఇవ్వలేదని తెలిపారు. మంత్రి వర్గ విస్తరణ, నామినేటెడ్ పోస్టులో ముదిరాజు, పద్మ శాలి, మున్నూరు కాపు, ఇతర కులాలకు స్థానం కల్పించాలని కోరారు. దీనిక స్పందించిన టీపీసీసీ అధ్యక్షుడు అధిష్టానానికి తెలియజేస్తానని తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో కాంగ్రెస్ నాయకులు వెంకటేష్ గౌడ్, నాయకులు వినయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

భక్తి భావం పెంపొందించుకోవాలి



స్వామివారి కల్యాణోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే

మిర్యాలగూడ : ప్రతి ఒక్కరూ భక్తిభావాన్ని పెంపొందించుకున్నట్లయితే మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం స్వాతి నక్షత్రం సందర్భంగా దామరచర్ల మండలంలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవంలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి కల్యాణోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో హాజరై తిలకించి స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అదే విధంగా మిర్యాలగూడ పట్టణంలోని హౌసింగ్ బోర్డులోని శ్రీ అలివేలుమంగ పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి వారి ఆలయం 25ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించే ధనుర్మాస ఉత్సవాల కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. అనంతరం స్వామివారిని దర్శించుకోని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



మిర్యాలగూడ : మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న మండల ప్రత్యేకాధికారి పత్యానాయక్



త్రిపురారం : గురుకుల పాఠశాలలో భోజనం రుచి చూస్తున్న ప్రత్యేక అధికారి కృష్ణవేణి

మిర్యాలగూడ : మధ్యాహ్న భోజనం సక్రమంగా ఉండేలా చూడాలని దామరచర్ల మండల ప్రత్యేకాధికారి, జిల్లా సహకార అధికారి ఎం.పత్యానాయక్ అన్నారు. శుక్రవారం ఆయన దామరచర్ల మండల కేంద్రంలోని తెలంగాణ గిరిజన గురుకుల బాలుర పాఠశాలను తనిఖీ చేసి మధ్యాహ్న భోజనంలో అందించే ఆహార పదార్థాలను రుచి చూశారు. ఈ సందర్భంగా ఆన మాట్లాడుతూ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు ప్రతిరోజు పాఠశాల నిర్వహణలో భాగంగా మధ్యాహ్న భోజనంతోపాటు మూత్రశాలలను విధిగా పర్యవేక్షించి పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. అపరిశుభ్రత వల్ల విద్యార్థులు అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉందన్నారు. ఆయన వెంట డీసీఓ లక్ష్మయ్య, ఉన్నారు.

త్రిపురారం : విద్యార్థులు ఇష్టంగా తినే విధంగా భోజనాన్ని వండాలని జిల్లా ఏఎస్‌ఓ, నిడమనూరు మండల ప్రత్యేక అధికారి కృష్ణవేణి అన్నారు. గురువారం నిడమనూరు మండలంలోని బీసీ గురుకుల పాఠశాల, మైనార్టీ గురుకుల పాఠశాల, కాస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా రిజిస్టర్లు, విద్యార్థుల హాజరును పరిశీలించారు. అధికారులు, విద్యార్థులతో కలసి మధ్యాహ్న భోజనాన్ని తిని సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం వంట చేసే ప్రాంతం, తరగతి గదులు, పరిసరాలను పరిశీలించి నిత్యం పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. విద్యార్థులకు పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. చలికాలం కావడంతో నిద్రించే గదుల్లో అన్ని వసతులు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో నిడమనూరు ఎంఈఓ లావురి వెంకన్న నాయక్, పలువురు అధికారులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మిర్యాలగూడ టౌన్ : ప్రభుత్వ పాఠశాలలు, ఆదర్శ, గురుకుల పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం తయారీలో నాణ్యత ప్రమాణాలను పాటించాలని మండల విద్యాశాధికారి బాలునాయక్ అన్నారు. శుక్రవారం మిర్యాలగూడ మండలం తుంగపాడు గ్రామ పంచాయతీ పరిధిలోని తెలంగాణ మోడల్ స్కూల్, ప్రాథమిక పాఠశాల, సామేగానితండా, లావూడి తండాల్లో ప్రభుత్వ పాఠశాలలను తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులకు వండిన భోజనంతో పాటు వంట సామగ్రిని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థులను ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ రంజిత, రాజ్య, పద్మ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల ముందస్తు అరెస్ట్



త్రిపురారం : పోలీస్ స్టేషన్‌లో నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు



కొండమల్లేపల్లి : అరెస్టయిన బీజేపీ నాయకులు

కొండమల్లేపల్లి : గురుకుల పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫుడ్ పాయిజన్ ఘటనల నేపథ్యంలో బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమం సందర్భంగా శుక్రవారం పలువురు బీజేపీ నాయకులను పోలీసులు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అరెస్టయిన వారిలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి జంగిటి మల్లేష్‌యాదవ్, భరత్‌కుమార్, సాయిచంద్, రాహుల్, ఉదయ్, మధు తదితరులు పాల్గొన్నారు.

త్రిపురారం : చలో హైదరాబాద్ కార్యక్రమానికి వెళ్తున్న త్రిపురారం మండల బీజేపీ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు పోలీస్ స్టేషన్‌లోనే నిరసన వ్యక్తం చేశారు. అరెస్ట్ అయిన వారిలో బీజేపీ మండల అధ్యక్షుడు పానుగోటి హరీష్, మల్లిఖార్జున్, మహేష్ పాల్గొన్నారు.

చింతపల్లి : ప్రభుత్వం గురుకుల విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చెనమోని రాములు అన్నారు. హైదరాబాద్‌లోని మసాబ్ ట్యాంక్ గురుకుల విద్యార్థుల సమస్యలపై బీజేపీ ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ మోర్చా నిర్వహించే నిరసన కార్యక్రమానికి వెళ్తున్న బీజేపీ శ్రేణులను శుక్రవారం ముందస్తు అరెస్టు చేశారు. అరెస్ట్ అయిన వారిలో బీజేపీ మండల అధ్యక్షులు శివర్ల రమేష్ యాదవ్, నగేష్, సైదులు పాల్గొన్నారు.

సింహగర్జన సభను విజయవంతం చేయాలి

మిర్యాలగూడ : హైదరాబాద్‌లో ఆదివారం నిర్వహించే మాలల సింహగర్జన సభను విజయవంతం చేయాలని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు తాళ్లపల్లి రవి అన్నారు. శుక్రవారం ఆయన పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి ఇప్పటివరకు 59కులాలు ఎవరి వాటా ఎంత తీసుకున్నారో సమగ్ర సర్వేలో ప్రభుత్వం నిజాయితీగా బయటపెట్టాలన్నారు. 2014 నుంచి నేటి వరకు గురుకులాల్లో ఓవర్సీస్, విద్యారంగాల్లో లబ్ధిపొందిన మాల, మాదిగల ఉపకులాల వారీగా లెక్కలతో ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బొప్పని నగేష్, నాగటి జోసఫ్, సురేష్, కరుణాకర్, నాగయ్య, వీరు పాల్గొన్నారు.

చింతపల్లి : సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో ఆదివారం నిర్వహించే మాలల సింహగర్జన పోస్టర్‌ను గొల్లపల్లి గ్రామంలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి రాష్ట్ర కార్యనిర్వాహణాధికారి నల్లవెల్లి సంజీవ, మండల కన్వీనర్ గాదరి జంగయ్య శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలనాయకులు సింహగర్జనను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమం లో మండల కన్వీనర్ మండల కో కన్వీనర్ ఆంజనేయులు, యాదయ్య పాల్గొన్నారు

నాసిరకం భోజనంతోనే విద్యార్థులకు ఫుడ్ పాయిజన్



మిర్యాలగూడ అర్బన్ : సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

మిర్యాలగూడ అర్బన్ : సంక్షేమ హాస్టళ్లలో నాసిరకమైన భోజనం పెడుతుండటంతోనే విద్యార్థులకు ఫుడ్‌పాయిజన్ అయి ప్రాణాలు పోతున్నాయని, వారి మృతికి రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని ఎస్‌ఎఫ్‌ఐ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు జగన్, సైదానాయక్ లు అన్నారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. విద్యార్థుల మృతికి ప్రభుత్వం బాధ్యత వహించాలన్నారు. శనివారం నిర్వహించనున్న రాష్ట్ర వ్యాప్త ప్రభుత్వ పాఠశాలల బంద్‌ను విజవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు వీరన్న, మణి, సంపత్, సిపాయి, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వంలో చలనం రావడం లేదు

హాలియా : రాష్ట్రంలోని పలు పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వికటిస్తూ విద్యార్థులు అస్వస్థతకు గురవుతుంటే ప్రభుత్వం చలనం రావడం లేదని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి కోరే రమేష్ విమర్శించారు. శుక్రవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శనివారం చేపట్టే ప్రభుత్వ పాఠశాలల బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో అనుముల మండల కమిటీ సభ్యులు వర్షిత్, నాగరాజ్, గణేష్, అంజలి తదితరులు ఉన్నారు.

పనికి తగ్గ వేతనం చెల్లించాలని ఆందోళన

గుర్రంపోడు : కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో పనిచేస్తున్న బోధన, బోధనేతర సిబ్బంది సమాన పనికి సమాన వేతనం చెల్లించాలంటూ తమ ఆందోళనలో భాగంగా టీఎస్‌యూటీఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా టీఎస్ యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు కోదాటి మధు సూదన్ మాట్లాడుతూ 15ఏళ్లుగా శ్రమ దోపిడీకి గురవుతున్న కేజీబీవీ సిబ్బందికి మినిమం టైం స్కేలు వర్తింపజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ నాయకులు బి.సైదులు, విజయనిర్మల, యాదగిరి, కేజీబీవీ టీచర్లు హేమలత, ధనలక్ష్మి, రాధ, కవిత, సులోచన, కావ్య గార్ల పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలని వినతి

నల్లగొండ టౌన్ : పెండింగ్‌లో ఉన్న మిషన్ భగీరథ కార్మికుల ఆరు నెలల వేతనాలు చెల్లించకపోతే ఆందోళన చేయక తప్పదని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పల్లా దేవెందర్‌రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం అన్ని కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మిషన్ భగీరథ ఎస్ఈ డి.వెంకటేశ్వర్లుకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు నెలలుగా వేతనాలు లేకపోవడం వలన కార్మికులు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే వెతనాలు చెల్లించి మమల్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎండి.జాని, బత్తుల వెంకటేశం, దయాకర్, నిమ్మనగోటి శ్రీను, పాక శ్రీను, విజయ్‌కుమార్, నాగరాజు, రామకృష్ణ, రవి, సైదులు, మల్లేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.